ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 4 జూన్ 2024

కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడి హత్య 7లో..

బస్టాండ్ స్లాబ్ కూల్చివేతకు రంగం సిద్ధం 8లో..



బ్యాలెట్ కౌంటర్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- నేడే పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రెండు చోట్ల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- 21 రోజుల ఉత్కంఠకు పడనున్న తెర

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఇరవై ఒకటి రోజులుగా పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై నెలకొన్న ఉత్కంఠకు మంగళవారం తెరపడనున్నది. 20 రోజుల నుంచి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులతో పాటు ఆ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు తామంటే తామే గెలుస్తామనే ధీమాతో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల పోరు ప్రధానంగా ముగ్గురు అభ్యర్థుల మధ్య జరిగింది. కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి శ్రీనివాస్ గొమాసే తో పాటు మొత్తం 42 మంది అభ్యర్థులు పోటీ చేశారు. గత నెల 13 వ తేదీన నాలుగో విడతలో పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,96,430 ఓట్లకు గాను 10, 83, 453 ఓట్లు 67.87 శాతం పోలయ్యాయి. ఇందులో పురుషులు 7,87, 705 మందికి గాను, 5,40,774 మంది, మహిళలు 8,08,622 మందికి గాను 5,42,646, మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇతరుల్లో 130 మందికి గాను 33 మంది ఓట్లు వేశారు. ఈ నెల నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ సెంటినరీ కాలనీలో గల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో, మంచిర్యాల జిల్లా పరిధిలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి హాజీపూర్ లో గల ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానున్నది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం పోస్టల్ బ్యాలెట్లు సెంటినరీ కాలనీలో గల కేంద్రంలో లెక్కించనున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల అనంతరం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న ఓట్లను లెక్కించనున్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్లు ఏర్పాటు చేశారు. మొత్తం కౌంటింగ్ 17 రౌండ్‌ల నుంచి 21 రౌండ్‌ల వరకు కొనసాగనున్నది. మధ్యాహ్నం ఒంటిగంట కల్లా తుది ఫలితం వెల్లడి కానున్నదని అధికారులు చెబుతు న్నారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వీవీ ప్యాట్‌లలో డ్రా ద్వారా ఐదు పోలింగ్ బూత్‌లకు చెందిన వీవీ ప్యాట్లను ఉండే స్లిప్పులను లెక్కించనున్నారు. ఆ తర్వాత వాటిని ఈవీఎంలలో ఉన్న ఓట్లతో సరిపోల్చి చూడనున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు మొత్తం కౌంటింగ్ ప్ర క్రియ పూర్తి చేసి గెలిచిన అభ్యర్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. కౌంటింగ్‌కు సంబంధించి రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్లమెంటు ఎన్నికల అధికారి ముజ మ్మిల్ ఖాన్, ఎన్నికల పరిశీలకులు కౌంటింగ్ కేంద్రా లను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు.

● ఎగ్జిట్ పోల్స్ అన్ని కాంగ్రెస్‌కే అనుకూలం..

దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంటు చివరి విడత ఎన్నికల అనంతరం వివిధ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్‌లో ఎక్కువ సంస్థలు పెద్దపల్లి పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలవనున్నారని ప్రకటించాయి. ఎన్నికలకు రెండు రోజుల ముందు నుంచి బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడంతో సైలెంట్ ఓటింగ్ తమకే అనుకూలంగా ఉందని, పెద్దపల్లిలో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని బీజేపీకి చెందిన నాయకులు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన కొప్పుల ఈశ్వర్ మాజీ మంత్రి కావడం, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం, సింగరేణి కార్మికుడిగా పనిచేసిన అనుభవంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గుర్తింపు, బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకున్న అభిమానంతో తామే గెలుస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు గెలుపొందారు. అందులో చెన్నూర్ నుంచి జి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్ కుమార్ గెలుపొందారు. అదే కుటుంబానికి చెందిన వివేక్ తనయుడు వంశీకృష్ణ పెద్దపల్లి ఎంపీగా పోటీ చేశారు. ఈ ఎన్నికను పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పార్లమెంట్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. మొత్తం మీద మంగళవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌తో ఎవరు గెలుస్తారో అనే విషయం తేలనున్నది.

● కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత

కోల్‌సిటీ: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి పెద్దపల్లి, మంచిర్యాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్టు రామగుండం సీపీ శ్రీనివాస్ చెప్పారు. ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు ఓట్ల లెక్కింపునకు సహకరించాలని కోరారు. పెద్దపల్లి జోన్‌లోని రామగిరి జేఎన్‌టీయూ కళాశాలలో ఐదుగురు ఏసీపీలు, 16మంది సీఐలు, 36మంది ఎస్ఐలు, 99మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 102మంది కానిస్టేబుళ్లు, 22మంది ఉమెన్ కానిస్టేబుళ్లు, 87మంది హోంగార్డులు, మూడు స్పెషల్ పార్టీలు, ఒక కంపెనీ కేంద్రబలగాలు బందోబస్తులో పాల్గొంటాయన్నారు. మంచిర్యాల జోన్‌కు సంబంధించి ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఐదుగురు ఏసీపీలు, 14మంది సీఐలు, 40మంది ఎస్ఐలు, 112మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 96మంది కానిస్టేబుళ్లు, 21మంది ఉమెన్ కానిస్టేబుళ్లు, 80మంది హోంగార్డులు, మూడు స్పెషల్ పార్టీలు, ఒక ప్లాటూన్ కేంద్ర బలగాలు బందోబస్తులో ఉంటాయని చెప్పారు. ఉదయం ఆరు గంటల నుంచి 144సెక్షన్ విధించినట్టు, నలుగురుకంటే ఎక్కువ మంది గుమిగూడవద్దని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరం వరకు గుమికూడద్దని, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటోగుర్తింపు కార్డు భద్రత సిబ్బందికి చూపించి కౌంటింగ్ కేంద్రానికి రావాలని సూచించారు. గెలుపొందిన అభ్యర్థులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, మొబైల్ ఫోన్లు తీసుకెళ్లవద్దని సూచించారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియామవళిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● కౌంటింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం



కౌంటింగ్ కేంద్రంలోని పోస్టల్ బ్యాలెట్ గదిని పరిశీలిస్తున్న కలెక్టర్

రామగిరి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సోమవారం మండలంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన కౌంటింగ్ టేబుల్స్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దపల్లి, మంథని అసెంబ్లీలో 21 రౌండ్లు, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్‌లలో 19 రౌండ్ల కౌంటింగ్ ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ నిర్వహణకు 81 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు 26 టెబుల్స్‌లో 154 మందిని కౌంటింగ్ సిబ్బందితో ప్రత్యేకంగా హాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కౌంటింగ్‌పై అధికారులకు ఇచ్చిన అవగాహన శిక్షణలో పాల్గొన్నారు. భద్రత అంశాలపై ఉన్నతస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, దివాకర్ పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు, పోలైన ఓట్లు..

	మొత్తం ఓటర్లు					పోలైన ఓట్లు				
నియోజకవర్గం	బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
రామగుండం	260	1,09,826	1,09,870	27	2,19,223	69,613	65,704	13	1,35,330	61.59
మంథని	290	1,17,352	1,22,329	18	2,39,699	83,720	84,023	07	1,67,750	69.98
పెద్దపల్లి	290	1,26,719	1,30,466	07	2,57,192	92,768	90,711	03	1,83,482	71.34
చెన్నూర్	227	96,019	97,752	07	1,93,778	67,172	65,613	02	1,32,787	68.53
బెల్లంపల్లి	227	87,283	89,219	12	1,76,514	63,449	61,801	05	1,25,255	70.96
మంచిర్యాల	287	1,38,064	1,40,648	26	2,78,738	85,152	84,437	02	1,69,591	60.84
ధర్మపురి	269	1,12,442	1,18,338	06	2,30,786	78,900	90,357	01	1,69,258	73.34
మొత్తం	1,850	7,87,705	8,08,622	103	15,96,430	5,40,774	5,42,646	33	10,83,453	67.87

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారి ముమ్మిల్ ఖాన్, తదితరులు

పెద్దపల్లిటౌన్, జూన్ 3: జిల్లాలో జరిగే లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్‌తో కలిసి ఆన్‌లైన్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ రామగిరిలోని మంథని జేఎన్టీయూ కళాశాలలో జరుగుతుందన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, అసెంబ్లీ సెగ్మెంట్‌ల ఈవీఎం ఓట్ల లెక్కింపు కోసం ర్యాండమైజేషన్ ద్వారా అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా కౌంటింగ్ సిబ్బందిని కేటాయించామని కలెక్టర్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 81 మంది సిబ్బందిని బృందాల వారీగా ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ వినియోగించుకొని పారదర్శకంగా కేటాయించామని తెలిపారు. కార్యక్ర మంలో కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, డీటీ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

రామగుండం సీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

రామగిరి, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు కమీషనరేట్ వ్యాప్తంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు తావులేకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

ఓట్ల లెక్కింపు ముగిసే వరకు విధుల్లో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా వ్యవహరించాలని పేర్కొన్నా రు. అధికారుల విధులపై రోల్ క్లారిటీ ఉండాలని సూచించారు. అనంతరం కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లును పరిశీలించారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. డైవర్షన్ పై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ రమేశ్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ జాడి నరసింహులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

మండల వ్యవసాయ అధికారి నాగార్జున



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో నాగార్జున

కాల్వశ్రీరాంపూర్, జూన్ 3: నకిలీ విత్తనాల అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి నాగార్జున అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎరువుల దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమవుతున్న సందర్భంగా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే ఎరువుల దుకాణం సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన పత్తి, వరి విత్తనాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 3: మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకే వేదికై పూర్వ విద్యార్థులు కలుసుకుని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పాఠశాలలోని తమ తీపి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా పాఠశాల ఆవరణలో గడిపారు. చాలా సంవత్సరాల తర్వాత అప్పటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను సన్మానించారు.

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

జూలపల్లి, జూన్ 3. మండలంలోని కాచాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలోని వరండా పైకప్పు ప్రమాదకరంగా మారి పెచ్చులు ఊడిపోయి కిందపడింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల గదుల మరమ్మతు పనులు, కాంపౌండ్‌వాల్ నిర్మాణపనులు మరియు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు గాను ప్రభుత్వం లక్షలాది రూపాయలను మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాచాపూర్ గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ పనులు చేపట్టి గత సంవత్సరం పూర్తిచేశాడు. సంవత్సర కాలం గడవక ముందే పాఠశాల గదుల్లో పగుళ్ల రావడంపై గ్రామస్థులు సదరు కాంట్రాక్టర్ పనితీరుపై మండిపడుతున్నారు. కొద్దిరోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా పాఠశాల గదులు నాణ్యతాలోపంతో కూలిపోతు ప్రమాదకరంగా మారడంతో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల పనుల్లో జరిగిన నాణ్యతాలోపంపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించి కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను ప్రమాదాల బారి నుంచి కాపాడాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.



పెచ్చులూడి పడిన పాఠశాలలోని వరండా పైకప్పు

ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ వైపే మళ్లీ జనం చూపు

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిటౌన్, జూన్ 3: రాష్ట్రంలో ప్రజాపాలన అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న మాజీ మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ బీఆర్ఎస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈశ్వర్ మాట్లాడుతూ తొమ్మిదన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అమలుకాని హామీలను ఇచ్చి ఓట్లు దండుకున్నారని విమర్శించారు.

అధికారంలోకి రాగానే ప్రజాసంక్షేమాన్ని మరచి సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలు విసుగు చెందారని, మళ్లీ కేసీఆర్‌వైపే జనం మొగ్గు చూపుతున్నారని అన్నారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ అబద్ధాల పునాదులపై అధికారం చేపట్టిన కాంగ్రెస్ అక్రమ సంపాదన ధ్యేయంగా పనిచేస్తోందని మండిపడ్డారు. నీచ రాజకీయాలకు కాంగ్రెస్ తెర లేపిందని ఆరోపించారు. మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రావడం ఖాయమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు దక్కుతుందని, పార్టీ శ్రేణులు నిరుత్సాహపడకుండా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పార్టీ కోసం కష్టపడాలని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ పాలన, విజయాలపైన డాక్యుమెంటరీ ప్రదర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు. ఆములు నారాయణ, గంట రాములు, ఎంపీపీ బాలాజీరావు, నాయకులు రఘువీర్‌సింగ్, గోపు ఐలయ్య యాదవ్, పీటీ స్వామి, మురళీధర్‌రావు, ఉప్పు రాజ్‌కుమార్, బండారి శ్రీనివాస్‌గౌడ్, దాసరి ఉష, నారాయణదాస్ మారుతి, మార్క లక్ష్మణ్ , ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

రెస్టారెంట్ల తనిఖీ

కోల్‌సిటీ, జూన్ 3: రామగుండం కార్పొరేషన్‌లో సోమవారం పలు రెస్టారెంట్లలో ప్రజాఆరోగ్య విభాగం అధికారులు తనిఖీ నిర్వహించారు. రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన గడువు తేదీ దాటిన పదార్థాలను గుర్తించారు. గడువు దాటిన, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని తయారు చేస్తున్న రెస్టారెంట్లను గుర్తించి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాం, నాగభూషణం, సునీల్, కిరణ్, వైకుంఠం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఆర్టీసీ డిపో అధికారులకు ఏఐటీయూసీ వినతి


డిపో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, జూన్ 3: గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్ ఎంఎస్ రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏగౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖ ని ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ను సూపర్‌వైజర్ రమేష్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రమేష్‌ను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులకు ఇచ్చే వేతనం నుంచి కాంట్రాక్టర్ ఎంఎస్‌రెడ్డి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నా రు. గత నాలుగేళ్లుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకర మన్నారు. ఈవిషయమై కొన్ని నెలల క్రితం డిపో మేనేజర్, కాంట్రాక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు శివ, రాజు, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి

గంగాధర, జూన్ 3: గంగాధర మండలం తాడిజెర్రిలో వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుంటుకు మల్లయ్య(68) కుటుంబం రేకుల ఇంట్లో నివసిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఎండ తీవ్రతకు తీవ్ర అనారోగ్యానికి గురైన మల్లయ్యను కుటుంబీకులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన మల్లయ్య దహన సంస్కారాలకు గ్రామస్థులు విరాళం అందించి కార్యక్రమం నిర్వహించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

రామడుగు, జూన్ 3 : మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన కొత్త భూమయ్యకు చెందిన ఆవు పిడుగుపాటుతో ఆదివారం మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల పాడి ఆవు మృతి చెందడంతో రైతు రోధిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగ్గురిపై కత్తితో దాడి

● ఒకరి పరిస్థితి విషమం.. ఇద్దరికి గాయాలు

కోరుట్ల, జూన్ 3: టాయిలెట్ రూం శుభ్రపరిచే విషయంలో చోటు చేసుకున్న గొడవలో ముగ్గురిపై కత్తితో పొడిచి గాయపరిచిన సంఘటన కోరుట్ల పట్టణంలోని హాజీపుర కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు... బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలోని ఓ ఇంట్లో హజర్ పాషా, షేక్షఫీ అనే వ్యక్తులు వారి కుటుంబ సభ్యులతో కిరాయి ఇంట్లో వేరువేరుగా నివాసం ఉంటున్నారు. హజార్ పాషా తన భార్యతో నివాసం ఉంటూ పట్టణంలో పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేస్తుంటాడు. షేక్షఫీ ఇద్దరు పిల్లలు భార్య, మామతో నివాసం ఉంటూ పట్టణంలో చిరు వ్యాపారం చేస్తుంటాడు. వీరి ఇద్దరి కుటుంబాల మధ్య తరచుగా గొడవ జరుగుతోంది. సోమవారం హజర్ పాషా, షేక్షఫీ మధ్య గొడవ జరిగి ఉద్రిక్తతతకు దారితీసింది. గమనించిన షేక్షఫీ మామ సయ్యద్ మొహినోద్దీన్, ఆయన కూతురు సనా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే కోపోద్రిక్తుడైన హజర్పాషా పక్కనే తోపుడు బండిపైన ఉన్న కత్తితో దాడి చేయడంతో దాడిలో మొహినోద్దీన్తో పాటు సనా గాయపడ్డారు. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న గోదావరి గమనించి వారిని వారించే ప్రయత్నం చేయగా అమెపై కూడా హజర్ దాడి చేసాడు. సంఘటనలో మహినోద్దీన్ మెడ ప్రాతంలో తీవ్ర గాయంకాగా సనా, గోదావరి స్వల్పగాయాల పాలయ్యారు. మోహినోద్దిన్ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. షేక్షఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్కుమార్ తెలిపారు.

కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడి హత్య

● పాడె మోసిన ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మారం, జూన్ 3: ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు రేండ్ల నరేష్(40) హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి కటికెనపల్లి గ్రామంలో నరేష్ నూతన గృహ నిర్మాణ పనులు చేసుకుంటున్నాడు. అదే క్రమంలో ఆరుగురు వ్యక్తులు కలసి మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడి చేశారు. వీరి దాడిలో తీవ్రంగా గాయపడిన నరేష్ను వెంటనే కరీంనగర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం కటికెనపల్లిలో జరిగిన నరేష్ అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని పాడె మోశారు. నరేష్ అంతిమయాత్రకు గ్రామస్థులు తరలివచ్చారు. గ్రామంలో జరిగిన పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని పథకం ప్రకారమే నరేష్ను హత్య చేశారని పెద్దపల్లి సీఐ కృష్ణ తెలిపారు. హత్య కేసులో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తురిస్తున్నట్టు ఆయన తెలిపారు.

● పోలీసుల తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం


రేండ్ల నరేష్(ఫైల్)

పెద్దపల్లి పోలీస్ల పనితీరుపై త్వరలో సీఎంకు ఫిర్యాదు చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి అక్ష్మణ్కుమార్ తెలిపారు. సోమవారం కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడు నరేష్ హత్య ఘటన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి పోలీసుల నిర్లక్ష్యం కారణంగా నరేష్ మృతి చెందాడని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఇక్కడి పోలీస్ యంత్రాంగం విఫలమైందని ఆయన ఆరోపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పెద్దపల్లి సీఐ, ఎస్సైలపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా విన్నవించనున్నట్టు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


వేంపేటలో గంగామాత ఆలయంలో కల్యాణం


భీంరాజ్‌పల్లెలో సీతారాముల కల్యాణ మహోత్సవం

మెట్‌పల్లి రూరల్, జూన్ 3: మండలంలోని వేంపేట గ్రామంలో గంగామాత ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని గంగపుత్ర కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు కన్నుల పండువగా జరిపారు. సోమవారం గ్రామంలోని గంగామాత ఆలయంలోని అమ్మవారికి పురోహితులు ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికుల ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ కల్లెడ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గంగపుత్ర కమిటీ నాయకులు గంగారం, గంగన ర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

● గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లె గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండువలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొమ్మెన మాధవి -కుమార్, ధర్మకర్త చింతపంటి శశికళ-తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారులు గోవర్ధన నరసయ్య, సాయికృష్ణ ఆచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో స్థలం విక్రయించి మోసం

● నలుగురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 3: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే స్థలాన్ని పలువురికి విక్రయించి కొనుగోలుదారును మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో నలుగురిపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశాలపేట గ్రామానికి చెందిన (ప్రస్తుతం మహారాష్ట్రలోని పూణేలో నివాసం) గంగిరెడ్డి భీంరెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబర్ 277లో 167 గజాల ఇంటిస్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈ స్థలాన్ని గోపడి వీరరావు నుంచి పద్మలత, ఆమె వద్ద నుంచి మూల కిషన్‌రెడ్డి కొనుగోలు చేయగా అతడి నుంచి బాధితుడైన గంగిరెడ్డి భీంరెడ్డి కొనుగోలు చేశాడు. ఇదిలా ఉండగా బాధితుడి స్నేహితుడైన లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సునిల్‌లు కలిసి గంగిరెడ్డి భీంరెడ్డి ఏళ్ల తరబడిగా పూణేలో నివాసముంటున్నాడని గ్రహించి ఆ స్థలాన్ని కాజేయాలని కుట్ర పన్నారు. గోపడి వీరరావు కొడుకైన గోపడి మాధవరావుతో లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి కుమ్మక్కై, కిరణ్‌రెడ్డి తల్లి అయిన లక్కిరెడ్డి సుకన్య పేరిట డబుల్ రిజిస్ట్రేషన్ చేయించడమే గాక ఆ స్థలం పక్కనే ఉన్న 146 గజాల ఖాళీ స్థలాన్ని కూడా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, సాక్ష్యంగా సునీల్ వున్నాడు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. ఆ స్థలం తనదని బాధితుడు వెళ్లి నిర్మాణాన్ని అడ్డుకోబోగా వారించి, మళ్లీ వస్తే చంపుతానని బెదిరింపులకు గురిచేశారు. ఈ మేరకు బాధితుడు గంగిరెడ్డి భీంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులు గోపడి మాధవరావు, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, లక్కిరెడ్డి సుకన్య, సునీల్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు లక్కిరెడ్డి గోపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి ఆదేశాలతో నిందితుడిని జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాద బాధ్యులను శిక్షించాలి

గంభీరావుపేట, జూన్ 3 : గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లి ఎల్లయ్య (60) అనే వ్యక్తి మృతిచెందగా ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. గోరంటాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య అనే వ్యవసాయ కూలీ ఆదివారం సైకిల్‌పై మూలపల్లె వెళ్లి తిరిగి వస్తున్నాడు. కామారెడ్డి వైపు నుంచి గజసింగవరం వైపు వెళ్తున్న కారు ఎల్లయ్యను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కొద్ది సేపటికే మృతి చెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఎల్లయ్య మృతి చెందాడని మృతుడి బంధువులు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎల్లయ్య మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, మృతుడికి కుటుంబానికి పరిహారం చెల్లించాలని రాస్తారోకో చేశారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీస్‌లు అక్కడికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఎల్లయ్య మరణించాడని, వెంటనే కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని, మృతుడు ఎల్లయ్య కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహం తీసుకువచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని భీష్మించడంతో సీఐ శ్రీనివాస్‌గౌడ్ సముదాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.


గోరంటాలలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

టీకా వికటించి చిన్నారి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: టీకా వికటించి తమ చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బుర్క ఇషిత - రాకేశ్ దంపతులకు కూతురు అన్విశ్రీ(4 నెలలు) ఉంది. గత నెల 29న చిన్నారి అన్విశ్రీకి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో టీకా వేయించారు. అప్పటి నుంచి చిన్నారి తీవ్ర జ్వరం, విరేచనాలతో అస్వస్థతకు గురైంది. దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మందులను అందించి పంపించారు. సోమవారం పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది. టీకా వికటించడంతోనే తమ చిన్నారి చనిపోయిందని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. విచారణ జరిపి ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వైద్యురాలు స్రవంతిని సంప్రదించగా టీకా వికటించి చిన్నారి మృతి చెందిందనే తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇషిత ఏడో నెల గర్భిణిగా ఉన్న సమయంలో కడుపులోని బిడ్డ గుండెకు రంధ్రం ఉందని గుర్తించి వారికి వివరించామన్నారు. గత నెల 29న చిన్నారికి పెంటా వ్యాక్సిన్ వేశామని తెలిపారు. చిన్నారి మృతికి టీకా కారణం కాదని తెలిపారు.

ఎల్ఎల్‌బి నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 3: ఎస్‌యూ పరిధిలోని ఎల్.ఎల్.బీ నాలుగు, ఆరో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 11వ తేదీ తుది గడువు అని,300/- అపరాధ రుసుంతో 14వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 3 : ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్.ఎం నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 11వ తేదీ తుది గడువు అని,300/ల అపరాధ రుసుంతో 14వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు సరికాదు

● మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హన్మంతరావు

మల్యాల, జూన్ 3: దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని, అభివృద్ధి చేసి ప్రజల నుంచి ఓట్లు అడగాలే తప్ప దేవుని పేరు చెప్పి ఓట్లు తీసుకునే ఆచారం పక్కన పెట్టాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామిని సోమవారం దర్శించుకున్నారు. స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి చేయకుండా అయోధ్య పేరు చెప్పి ఓట్లు అడిగిన బీజేపీకి అబద్ధాలు చెప్పి ఓట్లు అడిగిన కేసీఆర్ గతే పడుతుందని విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టుకు 500కోట్లు అని ప్రకటించి ఇవ్వకపోవడంతోనే బీఆర్ఎస్‌ను కొండగట్టు అంజన్న అధికారంలోకి రాకుండా చేశారని, ప్రజలతో పాటు దేవుళ్లతోనూ అబద్ధాలు ఆడడం కేసీఆర్‌కు అలవాటేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండగట్టు దేవస్థానం అభివృద్ధి కోసం ఈ ప్రాంతం వాసులు అనేక ఆశలు పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి ఇక్కడ సౌకర్యాలు, సదుపాయాల కోసం విన్నవించి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమి విజయం సాధించాలని ఆంజనేయస్వామిని కోరుకున్నట్లు వీహెచ్ తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి అట్టడుగు వర్గాల ప్రజలకు, జనాభా ప్రతిపాదికన అందాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తారని చెప్పారు. బడుగు బలహీన వర్గాల కోసం రాహుల్‌గాంధీ పోరాడుతుండగా మరో నాయకుడు దేవుళ్ల పేరిట ఓట్లు అడిగి కేవలం ధనవంతులకే లాభం చేస్తున్నారని పరోక్షంగా ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ఆయన వెంట దొంగ ఆనందరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, నేరెళ్ల సతీస్‌రెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సంత ప్రకాష్‌రెడ్డి, గాజుల అజయ్, నల్లపు మల్లేశం తదితరులు ఉన్నారు.


కొండగట్టులో అంజన్న దర్శనం చేసుకుని వస్తున్న వీహెచ్

సీఎంను కలిసిన సివిల్స్ ర్యాంకర్


సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రామడుగు, జూన్ 3: కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించాడు. కాగా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని తల్లి లక్ష్మితో హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం సాయికిరణ్‌ను శాలువాతో సన్మానించారు. పేదరికంతో ఉన్నత చదువులు చదివించిన తల్లి లక్ష్మిని సీఎం అభినందించారు. పోస్టింగ్ తీసుకున్న తర్వాత తనను మరోసారి కలవాలని సాయికిరణ్‌ను సీఎం కోరారు. మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు తదితరులు ఉన్నారు.

హనుమాన్ జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

మల్యాల, జూన్ 3: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గత నెల 30నుంచి ఈ నెల 1వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి రూ.1,51,38,490ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.31,09,700, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.9,76,150, ప్రత్యేక దర్శనం రూ. 21,77,500, ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ.76,42,000ల లడ్డూ విక్రయాలు, రూ.12,33,140ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1.30,43,525 సమకూరగా ఈ సారి రూ.20,64,965 అధికంగా వచ్చినట్లు అయింది.

భర్త మాట్లాడడం లేదని భార్య ఆత్మహత్య


మమత (ఫైల్)

గన్నేరువరం, జూన్ 3: భర్త తనతో సరిగా మాట్లాడడం లేదని తీవ్ర మనస్థాపం చెందిన భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గన్నేరువరం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పత్తి మమత(27) దుర్గాప్రసాద్‌లకు 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 సంవత్సరాల కొడుకు ఉన్నాడు. రెండు నెలల క్రితం భర్త దుర్గాప్రసాద్ ఉపాధి కోసం జార్ఖండ్‌కు వెళ్లాడు. భర్త జార్ఖండ్‌కి వెళ్ళినప్పటి నుంచి మాట్లాడడం లేదని కుటుంబ పోషణకు డబ్బులు పంపడం లేదని తన తండ్రి జోగయ్యకు చెప్పు కుంటూ బాధపడేది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన మమత సోమవారం తన ఇంటిలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి టేకు జోగ య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూన్ 3: అప్పు తీర్చే మార్గం లేక మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన వడకాపురం శ్రీనివాస్(44) చెట్టుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ తెలిపి న వివరాల ప్రకారం.. పడకల్ గ్రామానికి చెందిన వడకాపురం శ్రీనివాస్ రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీనివాస్ కోసం వెతుకుతున్నారు. సోమవారం ఓ రైతు తన పొలంలోకి వెళ్లగా అక్కడ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీనివాస్ గతంలో ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసి అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేని బెంగతో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భీమారం, జూన్ 3: మండలంలోని గోవిందారం గ్రామంలో గొంటి స్వరూప-స్వామికి చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. సంఘటనా స్థలానికి విద్యుత్ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులు వచ్చి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కరండ్ల మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమప్రభాకర్, వనపర్తి దశరథం, రాగేటి గంగాధర్, పుల్లూరి దేవయ్య కోరుతున్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య


లక్ష్మి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో మాదాసు లక్ష్మి (45) అనే వివాహిత అప్పుల బాధతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి మాదాసు లక్ష్మి-నర్సింలు దంపతులు దినసరి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. సరైన పనులు లభించకపోవడంతో ఐదేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పు చేసి నర్సింలు బహ్రెయిన్ వలస వెళ్లాడు. చాలీచాలని వేతనంతో పనులు చేసినా అప్పులు తీరలేదు. మూడేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన రెండేళ్ల తర్వాత తిరిగి పయనమయ్యాడు. తండ్రి గల్ఫ్ దేశానికి వలస వెళ్లిన అప్పు తీరకపోవడంతో కొడుకు నాని మరో రూ.2 లక్షలు అప్పు చేసి ఏడాది కిందట దుబాయికి వెళ్లాడు. తండ్రి నర్సింలు బహ్రెయిన్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై కదలలేని స్థితికి చేరుకున్నాడు. అక్కడ చికిత్స పొందిన ఆయన మూడు నెలల కిందట ఇంటికి వచ్చాడు. ఓ వైపు కదలలేని భర్త.. మరో వైపు అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఇంట్లో ఉరేసుకుంది. భర్త నర్సింలు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్ఐ విధులకు ఆటంకం

● యువకులపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 3: తీగలగుట్టపల్లిలోని అపోలోరీచ్ ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి జరిగిన గొడవకు సంబంధించి ఎస్ఐ విధులను ఆటంకపరిచి నందుకు సుభాష్‌నగర్‌కు చెందిన యువకులపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కాంగ్రెస్ నాయకుడిపై ఆదివారం దాడి జరగ్గా అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి సుభాష్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు ఆసుపత్రి వద్దకు వెళ్లగా అక్కడ గొడవ జరగకుండా విధుల్లో ఉన్న ధర్మారం ఎస్ఐ సత్యనారాయణ ఇరువర్గాల వారికి సర్దిచెబుతుండగా దురుసుగా ప్రవర్తించారు. ఈ మేరకు తన విధులను ఆటంకపరిచారని ఎస్ఐ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

సిరిసిల్ల రూరల్, జూన్ 3: ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన మూడు కేసుల్లో ఒకరికి సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన సోమవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏప్రిల్ 2వ తేదీన నేరెళ్లకు చెందిన మీసాల బాలరాజు తన వాహనాన్ని సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద పార్క్ చేశాడు. ఏప్రిల్ 3వ తేదీన పట్టణంలోని సాయినగర్‌కు చెందిన వీరబత్తిని మహేష్ తన వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్క్ చేశాడు. ఏప్రిల్ 5వ తేదీన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన వాసాల శివకుమార్ తన వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్క్ చేశాడు. ఈ మూడు వాహనాలు చోరీకి గురైనట్లు బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అజం గంజ్‌కు చెందిన మలావత్ తులసీరాంను రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం ఎస్సై శ్రీనివాసరావు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ నిందితుడిని ప్రవేశపెట్టారు. నిందితుడు మేజిస్ట్రేట్ ముందు నేరాన్ని అంగీకరించడంతో సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

ప్రమాదాలకు నిలయం సుల్తానాబాద్ రాజీవ్‌రహదారి


ఇటీవల ప్రమాదానికి గురైన కారు


బస్టాండ్ వద్ద బస్సును ఢీకొన్న లారీ(ఫైల్)



సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీ

- కానరాని ప్రమాద నివారణ చర్యలు

- పట్టించుకోని అధికారులు

సుల్తానాబాద్, జూన్ 3: సుల్తానాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. ముఖ్యంగా సుల్తానాబాద్ ఎంట్రన్స్ శాస్త్రినగర్ నుంచి సుల్తానాబాద్ పట్టణ చెరువు వరకు ఉన్న రోడ్డులో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక బస్టాండ్ వద్ద మాత్రం నిత్యం ఏదో ఒక రూపంలో ప్రమాదం చోటు చేసుకోవడం, గాయాల పాలు కావడం తప్పడం లేదు. దాంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రజలు జడుసుకుంటున్నారు. అసలే రాజీవ్ రహదారి ప్రమాదాలకు పెట్టింది పేరుగా నిలిచింది. కొన్ని నెలల నుంచి ప్రమాదాలు ఎక్కువై ప్రాణాలు కోల్పోతున్నా, మరేందరో గాయపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల వరకు..

రాజీవ్ రహదారి దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల గ్రామం వరకు సుల్తానాబాద్ మండలం విస్తరించి ఉంది. ఈ రోడ్డు మధ్యలో దుబ్బపల్లి, భూపతిపూర్, గర్రెపల్లి, నర్సయ్యపల్లి, కాట్నపల్లి, రైస్‌మిల్లుల ప్రాంతం, శాస్త్రినగర్, సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా, బస్టాండ్ ఏరియా, చెరువు ప్రాంతం, సుగ్లాంపల్లి సబ్‌స్టేషన్, చిన్నకలువల గ్రామాల వద్ద రాజీవ్ రహదారిపై గల యూటర్న్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.

●ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రమాదాల అడ్డా

సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఏరియా ప్రమాదాలకు అడ్డాగా మారింది. రోడ్డు చాలా కింది బాగంలో బస్టాండ్ ఉండడం, రాజీవ్ రహదారి నుంచి బస్సులు బస్టాండ్ లోపలకు వెళ్లే క్రమంలో, మళ్లీ బస్సులో బయటకు వెలుతున్న సందర్భంలో రాజీవ్ రహదారి నుంచి రాకపోకలు సాగించే వాహనాలు బస్సులను ఢీ కొంటున్నాయి. రోజూ ప్రమాదాలు జరుగుతున్నా ఇటు ఆర్టీసీ వారు కానీ అటు పోలీస్ వారు కానీ లేదా రాజీవ్ రహదారి నిర్వహకులు కానీ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. వారం రోజుల క్రితం బస్సు బయటకు వస్తుండగా లారీ ఢీ కొంది. ప్రయాణికులు గాయపడ్డారు.

● ట్రాఫిక్ సమస్యల చెంత ఐబీ చౌరస్తా..

సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా ట్రాఫిక్ సమస్యలతో సతమతవుతుంది. ఓదెల కాల్వశ్రీరాంపూర్ మండలాల నుంచి వచ్చే వాహనాలతో పాటు అదే రోడ్డులో ఉన్న గోదాములు, రైస్‌మిల్లులు, కంకర క్వారీలు, గ్రానైట్ క్వారీలు ఎక్కువ గా ఉండి ఆయా వాహనాల రద్దీ ఎక్కువ గా ఉండడం వలన చౌరస్తా వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. అదే స్థాయిలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఆ దారిలో ఉన్న దుకాణాదారులు తమ దుకాణాల కన్నా అదనంగా రోడ్డు మీదకు రావడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

● ఆరంభ శూరత్వంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు..

రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టిన సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు ఆరంభ శూరత్వంగా మిగిలిపోయింది. సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా నిత్యం ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాజీవ్ రహదారి నుంచి ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రాజీవ్ రహదారి నుంచి శ్రీరాంపూర్, ఓదెల, హుజూరాబాద్, పొత్కపల్లి హన్మకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు క్రాస్ చేస్తున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గం నుంచి రాజీవ్ రహదారి మీదకు గోదాముల నుంచి దాన్యం, బియ్యం లారీలు, క్వారీ ల నుంచి వచ్చే భారీ వాహనాలు, పలు మండలాల నుంచి వచ్చే ఇసుక లారీలు చేరే సందర్భంలో కూడా అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన, గాయపడిన సంఘటనలు చోటు చేసకుంటున్నాయి. దాంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ చౌరస్తా తో పాటు రాజీవ్ రహదారి నుంచి రాకపోకలు సాగించే వాహనాలను క్రమబద్ధీకరించేందుకు,ప ప్రమాదాల నివారణకు గాను ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి డీసీపీ, ఏసీపీ తదితరులతో పాటు కమిషనర్ స్థాయి అధికారులు కూడా పరిశీలన జరిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించి పోల్స్‌ను ఏర్పాటు చేసి సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాలుగు వైపులా సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి ఒకటి రెండు రోజులు పనితీరును కూడా పర్యవేక్షించారు. ఇంకా వాటిన అధికారికంగా ప్రారంభించనే లేదు. కానీ ఏమైందో కానీ ఆ తర్వాత వాటి గురించి పట్టించుకున్ననాథుడు లేకుండా పోయారు. రెండేళ్ల నుంచి మళ్లీ సిగ్నల్స్ ఏర్పాటు ఊసే తీయడం లేదు.

● ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎస్ఐ శ్రావణ్‌కుమార్

సుల్తానాబాద్‌లో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటాము. రాజీవ్ రహదారి పై ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించాము. అక్కడ స్టాపర్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికడతాం. ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి వాహన చోదకులకు కూడా తరుచూ అవగాహన కల్పిస్తున్నాము.

జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 3: పెద్దపల్లి జిల్లాకు బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని దళిత సంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్ అవకాశం కల్పించిన మహనీయులని వారి పేరును అంబేడ్కర్ జిల్లాగా మార్చాలని కోరారు.ఈ కార్యక్రమంతో మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి కైలసం, దళిత నాయకులు కలవల మల్లేష్,తాండ్ర శ్రీనివాస్, మాస్ పట్టణ అధ్యక్షుడు కండె కరుణకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

కళ్యాణ్‌నగర్, జూన్ 3: తెలంగాణ దశాబ్ది ప్రగతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో మెడికల్ కళాశాల తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రామగుండం ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని చెప్పారు.

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం


రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

వేములవాడ టౌన్, జూన్ 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో వేముల వాడకు చేరుకున్న భక్తులు ఆలయ వసతిగదులతోపాటు ప్రైవేటు గదుల్లో విడిది చేశారు. సోమవారం తెల్లవారు జామున కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి స్వామివారి ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో సుమారు నాలుగు గంటలపాటు నిరీక్షించారు. అనంతరం భీమేశ్వర, బద్దిపోచమ్మ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. సూపరింటెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, తిరుపతిరావు, అశోక్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న ఈవో

ఆలయ ఈవో రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపం లో రాజన్నఆలయ స్థానాచార్యులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు.

అసిస్టెంట్ హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 3 : సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థలో పని చేస్తున్న అసిస్టెంట్ హెల్పర్లకు పదోన్నతులు కల్పించడంతోపాటు పీఆర్‌సీని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెస్ పరిధిలో 147 మంది అసిస్టెంట్ హెల్పర్‌లు 27-09-2018న అబ్జర్వ్ చేసుకున్నట్లు, 26-09-2020న ప్రొబేషన్ డిక్లేర్ చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు ప్రొబేషన్ డిక్లరై నాలుగేళ్లు గడిచినా పాలకవర్గం అసిస్టెంట్ హెల్పర్ల మీదా కక్షపూరిత దోరణి అవలంబిస్తోందన్నారు. హెల్పర్‌లకు పదోన్నతి కల్పించడంలో జాప్యం జరిగిందన్నారు. దీనిపై 15-03- 2021న అసిస్టెంట్ హెల్పర్‌లకు పదోన్నతులు కల్పించాలని అప్పటి ఎండీ రామకృష్ణను అడిగితే 30 రోజులు గడువు ఇవ్వాలని కోరడంతోపాటు సమస్యను పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా లేఖ రాసిచ్చారన్నారు. ఇప్పటివరకు అసిస్టెంట్ హెల్పర్‌లకు పదోన్నతులను కల్పించలేదన్నారు. మరోసారీ ఎండికి అసిస్టెంట్ హెల్పర్‌లకు పదోన్నతుల గురించి 23-08-2022 రోజన మొరపెట్టుకోగా 30 రోజుల్లో సమస్యలను పరిష్కారిస్తామని మరోసారీ లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని, సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. సెస్‌లో పనిచేస్తున్నవారికి 2022 నుంచి పీఆర్‌సీని వర్తింపజేశారని,అసిస్టెంట్ హెల్పర్‌లకు మాత్రం పీఆర్‌సీ ఇవ్వలేదని అన్నారు. పాలకవర్గంతోపాటు అధికారులు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.



భూ నిర్వాసితులపై వివక్ష చూపుతున్న యాజమాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న అద్దె వాహనాల యజమానులు

కళ్యాణ్‌నగర్, జూన్ 3: సింగరేణి సంస్థ కోసం తాము సర్వం ధారపోస్తే సింగరేణి యాజమాన్యం తమపై కక్షగట్టి ఉపాధి లేకుండా చేయడానికి కుట్రలు పన్నుతుందని సింగరేణి ఏరియా భూనిర్వాసితుల అద్దె వాహనాల సంఘం ఆర్జీ-1, ఆర్జీ-2 ఏరియాల అధ్యక్షులు తోట సమ్మయ్య, నాగరాజు ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ కోసం తాము ఇల్లు, వాకిలి, భూములు, గొడ్డుగోద ఇచ్చామని, కానీ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా కేవలం అద్దె వాహనాలు పెట్టుకోవడానికి అవకాశం ఇచ్చిందని, ఇందులో కూడా తమను యాజమాన్యం వేధింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. 2000యూనిట్లకు ఒక రేటు చెల్లిస్తూ 4వేల యూనిట్లు తిప్పుకుంటున్నారని, అలా తిప్పితే మాకు ఏమి మిగలడం లేదన్నారు. క్వారీలో తిప్పితే చివరికి వాహనాలన్నీ చెడిపోతున్నాయని, సీఎంపీఎఫ్ మెలిక పెట్టి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సీఎండీని కలిశామని, సమస్య డైరెక్టర్(పా)కు అప్పగించారని, డైరెక్టర్(పా)ను కలిసి తమ సమస్యలను విన్నవిస్తే సీఎండీ నుంచి తనకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారని, మళ్లీ సీఎండీని కలిస్తే రెండు నెలలు కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని, కమిటీ వేయడం వల్ల తమకు ఒరిగేది ఏమి లేదన్నారు. తాము ఇప్పటికే అప్పులపాలయ్యామని, ఈ నెల 5 నుంచి సింగరేణి వ్యాప్తంగా సమ్మెలోకి దిగుతామని వారు హెచ్చరించారు. సీఎంపీఎఫ్ సాకు చూపి తమను ఆర్థికంగా విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యం కుట్రలు పన్నుతుందని, రెండు నెలలుగా తమకు రావాల్సిన బిల్లులను ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 26రోజులకు సీఎంపీఎఫ్ కడతామని చెప్పినప్పటికీ 11నెలల నుంచి 50శాతం బిల్లులో నుంచి కోత విధించారన్నారు. కొత్త రేట్ల ప్రకారం లైవ్‌లో నడిచే వాహనాలకు వర్తించకుండా కొత్తగా వచ్చే వాహనాలకు మాత్రమే వర్తింప చేస్తామని చెప్పడం శోచనీయమన్నారు. జూన్ 5 నుంచి సింగరేణి వ్యాప్తంగా తాము సమ్మెకు వెళతామని, వాహనాలను కూడా తీసుకెళతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో నాయకులు దబ్బెటి మల్లేష్, తోడేటి సదానందం, గోనె కుమార్, వడ్లకొండ రాజు, జీ శ్రీనివాస్, తోట సంపత్, రాజయ్య పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూన్ 3: రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సూచించారు. సోమవారం జీఎం కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓసీపీ-1,2, ఓబి వెలికితీతపై చర్చించారు. నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవడంతో పాటు రవాణా అంశాలపై చర్చించారు. సమష్టి కృషితోనే సింగరేణి సంస్థ నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకుంటుందని పేర్కొన్నారు. లక్ష్యసాధన కోసం అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్షా కాలంలో ఉత్పత్తికి విఘాతం ఏర్పడకుండా తగు ఏర్పాట్లను చేయాలని తెలిపారు. సమావేశంలో అధికారులు ఎలీషా, శ్రీనివాసులు, రఘుపతి, రమేశ్, రాజేందర్, వెంకటరమణ, చంద్రశేఖర్, పద్మరా జు, రవీందర్ రెడ్డి, విశ్వేశ్వర్‌రావు, శ్రీనివాస్, నాగరాజు, ఉదయ్‌హరిజన్, రామారావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు అర్హులకు అందేలా కుటుంబ సర్వే

- వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు - అంగన్‌వాడీల్లో జరిగే అవకతవకలకు చెక్

పెద్దపల్లి రూరల్, జూన్ 3: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా అర్హులకు చేకూరేందుకు గాను ప్రభుత్వం కుటుంబ సర్వే చేపడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, బాలమృతం వంటివి లబ్ధిదారుల వరకు చేరకుండానే అందించినట్లు రికార్డుల్లో రాసే విధానానికి చెక్ పెట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం న్యూట్రీషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పేరిట సర్వే చేపడుతోంది. మార్చి నెల నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం కాగా ప్రస్తుతం సర్వే పనులను వేగవంతం చేశారు. గతంలో మాదిరిగా రికార్డుల్లో నమోదు చేయకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను బట్టి సరుకులు సరఫరా చేయనున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకపోతే అనర్హులుగానే ఉంటారని అధికారులు పేర్కొంటున్నారు.

● పెద్దపల్లి ప్రాజెక్టులో 305 అంగన్‌వాడీ కేంద్రాలు

పెద్దపల్లి ప్రాజెక్టులో 305 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 1,558, బాలింతలు 1,136, ఏడేళ్ల లోపు చిన్నారులు 15,722 ఉన్నారు. వీరందరికి అంగన్‌వాడీ సేవలు అందించేందుకు, పథకాలు సమకూరేందుకు మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌టీఎస్ సర్వేను చేపట్టారు. పెద్దపల్లి ప్రాజెక్టులోని ప్రతీ అంగన్ వాడీ కేంద్రంలో సర్వే చేస్తున్నారు.

● ఇంటింటా సర్వే చేసి వివరాల నమోదు

సర్వేలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ఇంటింటికి సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మొదట కుటుంబ యజమాని పేరుతో నమోదు ప్రారంభించి తరువాత సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. వయస్సు, ఫోన్ నంబర్, కులం, ఉపకులం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అలాగే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ చేపట్టడానికి అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్‌లను అందించి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

● సర్వేతో అర్హులకు లబ్ధి చేకూరేలా ..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఇందులో బాలింతలు, గర్భిణులకు రోజుకు బియ్యం 150 గ్రాములు, కందిపప్పు 30 గ్రాములు, నూనె 16 గ్రాములు, పాలు 200 మిల్లీగ్రాములు, ఒక గుడ్డు ఇవ్వాలి. పిల్లలకు బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, నూనె 5 మిల్లీగ్రాములు, మూడేళ్ల లోపు పిల్లలకు 16 గ్రాములు, ఆపైన వయస్సు వారికి పనిరోజులు పరిగణలోకి తీసుకోని రోజుకు ఒక గుడ్డు అందిస్తారు. సర్వేలో భాగంగా కుటుంబాల సంఖ్య, జనాభా వివరాలు, చిన్నారుల ఎత్తుకు తగిన బరువు ఉన్నారా లేదా- అనేది తేలనుంది. దీంతో పోషక లోపంతో భాధపడుతున్న వారి వివరాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ఏ మేరకు అందుతుందో ఒక అంచనా ఏర్పాడుతుంది. గుడ్లు, పాలు కేంద్రాల నిర్వహకులు పక్కదారి పట్టిస్తారనే ఆరోపణలు అధిగమించేందుకు సర్వే చేపడుతున్నారు.


కాసులపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్(ఫైల్)

● సరుకుల పక్కదారికి బ్రేక్

అంగన్‌వాడి కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే వస్తువులు ఇకపై పక్కదారి పట్టకుండా ఉంటాయి. గతంలో అంగన్‌వాడి సెంటర్‌కు గర్భిణీలు, బాలింతలు హజరు కాకపోయినా కూడ టీచర్‌లు వచ్చినట్లు నమోదు చేసేవారు. ఇకపై లబ్దిదారులు కేంద్రానికి వచ్చి భోజనం చేస్తేనే హజరైనట్లు, కేంద్రానికి రాకుంటే మొబైల్ ఫోన్‌కి మేసేజ్ రూపకంగా వెళ్తుంది.ఈ సర్వేతో తీవ్ర పోషకాహార సమస్యతో భాధపడే పిల్లల సంఖ్య తేలనుంది.

● సర్వేను పక్కాగా చేపడుతున్నాం

- కవిత, సీడీపీవో, పెద్దపల్లి ప్రాజెక్ట్



పెద్దపల్లి ప్రాజెక్టులోని 305 అంగన్‌వాడి కేంద్రాల్లో న్యూట్రీషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం సర్వే పక్కాగా చేపడుతున్నాం. నేటి వరకు కొన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో సర్వేను ముమ్మరం చేశాం. సర్వే నిర్వహణలో పక్కాగా వివరాలు నమోదు చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు, సిబ్బంది సూచిం చాం. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు నమోదు చేస్తున్నాం. ఇకపై అవకతవకలకు అవకాశం ఉండదు.

బస్టాండ్ స్లాబ్ కూల్చివేతకు రంగం సిద్ధం

- ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారుల సందర్శన

- తాత్కాలిక షెడ్డు ఏర్పాటు

సుల్తానాబాద్, జూన్ 3: సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ స్లాబ్‌ను కూల్చివేయడానికి రోడ్డు రవాణా సంస్థ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆర్టీసీ సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సోమవారం సుల్తానాబాద్ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను అంచనా వేశారు. మంగళవారం కూల్చివేత ప్రారంభిస్తారని అంటున్నారు. ఈ మేరకు ప్రయాణికులు కూర్చోవడానికి నిల్చువడానికి తాత్కాలికంగా ఒక షెడ్డును కూడా ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన సుల్తానాబాద్ బస్టాండ్‌లో నిత్యం స్లాబ్‌కు సంబంధించిన పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడుతున్నాయి. ఒక ప్రయాణికురాలి తలపై పడి తీవ్రంగా గాయపడింది. అప్పటి నుంచి అధికారులు స్లాబ్ పెచ్చులు పడుతున్న స్థలంలో ప్రయాణికులు రాకుండా బారికేడ్లు కట్టారు. ఏడాది క్రితమే మరమ్మతులు చేశారు. కానీ స్లాబ్ నలభై ఏళ్లది కావడంతో అది శిథిలావస్థకు చేరింది. దాంతో ప్రత్యామ్నాయంగా సుల్తానాబాద్ బస్టాండ్‌లో ఏర్పాట్లు చేయాలని, మరో వైపు ప్రమాదాలను నివారించాలని అధికారులను నిర్ణయించారు. ఇందులో భాగంగా బస్టాండ్ స్లాబ్ మాత్రమే తొలగించి తాత్కాలికంగా బ్లూకలర్‌తో కూడిన రేకులతో పిల్లర్లు బీమ్‌లపై షెడ్డు వేయనున్నారు.

● ప్రమాదాలకు నిలయమైన బస్‌స్టేషన్..

సుల్తానాబాద్ బస్‌స్టేషన్ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న బస్టాండ్‌ను నలభై ఏళ్ల క్రితం నిర్మించారు. కానీ ప్రస్తుతం రోడ్డు ఎత్తుగా ఉండి బస్టాండ్ కిందకు ఉండడంతో బస్టాండ్ నుంచి రోడ్డు పైకి బస్సులు వస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న వాహనాలు కనబడని పరిస్థితి ఉండి రోజు వాహనాలు ఢీకొంటున్నాయి. దాంతో ప్రయాణికుల గాయాలపాలవుతున్నారు.


స్లాబ్ పెచ్చులు ఊడిన దగ్గర ఏర్పాటు చేసిన బారికేడ్లు

బస్టాండ్‌ను కొత్తగా నిర్మించాలంటే నిధుల సమస్య ఏర్పడిందని అధికారులు అంటున్నారు. దాదాపు రెండు కోట్లనిధులు అవసరమని భావిస్తున్నారు.

● ఇంజనీరింగ్ అధికారులు పరిశీలిస్తున్నారు..

- కరీంనగర్ - 2 డిపో మేనేజర్ మల్లేశం

ఇంజనీరింగ్ అధికారుల నివేదిక మేరకు సుల్తానాబాద్ బస్టాండ్ స్లాబ్ శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు మూడురోజుల నుంచి తమ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సుల్తానాబా ద్‌లో పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని పిట్లం, హన్మకొండ తదితర ప్రాంతాల్లో కూడా పాత బస్ స్టేషన్లు ఇలాగే ఉంటే వాటిని కొత్తగా డిజైన్‌తో మార్పు చేయించాం. సుల్తానాబాద్‌లో కూడా అలాగే చేస్తాము.


బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు

● తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశాము..

ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారి వెంకటేశ్వర్‌రావు

బస్టాండ్ స్లాబ్ తొలగిస్తున్న నేపథ్యంలో సుల్తానాబాద్‌లో ప్రయాణికుల కోసం పక్కనే తాత్కాలికంగా తడకలతో ఒక షెడ్డును ఏర్పాటు చేశాము. తమ అధికారుల బృందం సుల్తానాబాద్ బస్టాండ్‌ను పరిశీలించి బస్టాండ్ స్లాబ్‌ను కూల్చివేయాలని నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాము. కొత్తగా బస్టాండ్‌ను నిర్మించే పరిస్థితి ఆర్టీసీలో లేదు. ప్రభుత్వం ద్వారా కానీ ఇతర ప్రజాప్రతినిదులు పద్దుల నుంచి కానీ ఏమైనా నిధులు కేటాయిస్తే నూతన బస్‌స్టేషన్ నిర్మించడానికి అలోచించవలసి ఉంది.